వెంకటస్వామి వర్గంవాళ్లు పాపారావుకి బెయిల్ యిచ్చి బైటికి తీసుకొచ్చారు....

ఇరువర్గాల వాళ్ళు కోర్టులో బలాబలాలు తేల్చుకోడానికి నిర్ణయించుకున్నారు.

డాక్టర్ ఫణీంద్రరావు కూతురు, మైనరు అయిన వీణని పాపారావు మాయమాటలు చెప్పి లేవదీసుకపోవడమేగాక బలవంతంగా పెళ్ళి చేసుకున్నాడని పాపారావు మీద అభియోగం.

వీణ తన యిష్టానుసారమే తనతో వచ్చిందని, ఆమె అంగీకారంతోనే ఆమెను తను వివాహ మాడానని ఇందులో తను చేసిన నేరమేమీ లేదని, తను నిర్దోషినని పాపారావు డిఫెన్స్ పెట్టాడు.

లాయర్లకి పని తగిలింది. బార్ అసోసియేషన్ రెండుగా చీలిపోయింది.

కేసు విచారణ ప్రారంభమైంది.

రోజూ కోర్టు జనంతో కిటకిటలాడిపోతోంది.

వీణ మైనర్ అని ఋజువు చెయ్యడానికి ఎస్. ఎస్. సి. సర్టిఫికెట్లోని పుట్టిన తేదీ చూపించాడు ప్రాసిక్యూటర్....

సాక్షుల విచారణ ప్రారంభమైంది.

తనని మాయమాటలు చెప్పి బలవంతంగా తీసుకుపోయాడని, తన యిష్టానికి వ్యతిరేకంగా పెళ్ళి చేసుకున్నాడని వీణ సాక్ష్యం చెప్పింది.

జనం ఆశ్చర్యపోయారు.

పాపారావు ఖిన్నుడై పోయాడు.

అతనికి ప్రపంచమంతా మయసభలా కనిపించింది. ప్రకృతంతా చచ్చిపోయినట్టు, తన పాట కాలి బూడిదై పోయినట్టు అనిపించింది. ఉదయించే సూర్యుడు కొన్ని గంటలు వెలుగిచ్చి, తనను నమ్మినవారిని చీకట్లోకి నెట్టేసే మోసగాడిలా అనిపించాడు.

ఛీ— మనుషులు అనుకున్నాడు పాపారావు.

అతనికి చేతులకి బేడీలు పడినట్టు, జైలులో కూర్చుని తను

